



Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com






ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 610 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర 12 శుక్రవారం డిసెంబర్2025 పేజీలు : 4 వెల : అమూల్యం


మెస్సీ ఈవెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వానికి

## సంబంధం లేదు:

### సీఎం రేవంత్ రెడ్డి

కార్యక్రమమని, దీనితో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యక్ష సంబంధం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దిల్లీ పర్యటన ముగించుకుని తిరిగి వస్తున్న సందర్భంగా ఆయన పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. మెస్సీ పర్యటనను ఒక ప్రైవేట్ సంస్థ నిర్వహిస్తోందని, ప్రభుత్వం కేవలం అవసరమైన సహకారం మాత్రమే అందిస్తోందని ఆయన తెలిపారు.



2

గిరిజన పాఠశాలల్లో 417 ఉపాధ్యాయ పోస్టుల

## అప్‌గ్రేడేషన్‌కు గ్రీన్ సిగ్నల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర పడింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో రహదారుల విస్తరణ, ఉద్యోగుల సంక్షేమం, విద్యా రంగం, జైళ్ల సంస్కరణలకు సంబంధించిన ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం అనంతరం కేబినెట్ నిర్ణయాలను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు వెల్లడించారు.

2







## బ్యాంకు కొలువులు

## సుష్మా నాయుడు సొంతం

- ఏడాదిలో అయిదు ఉద్యోగాలు - జర్నలిస్టు కుమార్తె సక్సెస్ స్టోరీ

కడియం, సింహగర్జన ప్రతినిధి, డిసెంబర్ 11 : జనరల్ కేటగిరీకి చెందిన వారంతా సాఫ్ట్ వేర్ ఉద్యోగాలకే మొగ్గుచూపుతున్నారు. ఆ సాఫ్ట్ వేర్ పరిస్థితి ఇప్పుడు చాలా నీరసంగా ఉన్నప్పటికీ వేరే మార్గం లేదనుకుని ఆ ఉద్యోగాల కోసమే పోటీ పడుతుంటారు. ఈ అమ్మాయి కూడా మొదట్లో అలాగే ప్రయత్నించింది. కాని అక్కడ ఉన్న పరిస్థితి చూసి ప్రభుత్వ బ్యాంకు ఉద్యోగాలపై దృష్టి సారించింది. హాజరైన ప్రతి పరీక్షలలో సత్తా చాటింది. లక్షలాది మందితో పోటీపడి ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఏడాదిలోనే అయిదు కీలకమైన ఉద్యోగాలను సాధించి ఎందరికో ఆదర్శంగా నిలుస్తుంది. తూర్పు గోదారి జిల్లా కడియం మండలం దుళ్ల ఉప సర్పంచ్, సీనియర్ జర్నలిస్టు తోకల




శ్రీనివాసరావు కుమార్తె "సుష్మా నాయుడు" బ్యాంక్ అకౌంట్ లో ఉన్న డబ్బులను డ్రా చేసినంత సులువుగా ఈ ప్రభుత్వ బ్యాంక్ ఉద్యోగాలను సాధించి అందర్నీ అబ్బురపరుస్తుంది.

పల్లెల్లో

## పన్నుల మోత

యు.కొత్తపల్లి, సింహగర్జన ప్రతినిధి, డిసెంబర్ 11 : పల్లెలలో పన్నుల మోత ఇళ్లపై మోగిస్తున్నారు. యు.కొత్తపల్లి మండలం వాకతిప్ప గ్రామంలో సర్వేల పేరిట ఇండ్లకు ఏడాదికి ఒకసారి చెల్లించే పంచాయతీ పన్నులను ఒకేసారి మూడు రెట్లు పెంచేశారని ప్రజలు వాపోతున్నారు. ఇదేమని అడిగితే గతంలో పన్నులు చాలా తక్కువగా వేశారని మూడు కేటగిరీలుగా విభజించారని, పెంకుటి ఇల్లు, కాంక్రీట్ స్లాబ్, రేకుల ఇల్లు వారీగా పన్నులు విధిస్తున్నట్లు పంచాయితీ సిబ్బంది చెబుతున్నారు. షాపులువుంటే కమర్షియల్ కేటగిరిలో పన్నులు చెల్లించాలన్నారు. మద్రాస్ టెర్రస్ లాడు ఇళ్లకు కాంక్రీట్ స్లాబ్ ఇళ్లకు మాదిరి పన్నులు విధిస్తున్నారు. ఇదేమని అడిగిన వారికి ఇది ఇదివరకు జరిగిన సర్వే ప్రకారమే నమోదు చేస్తున్నామనే సమాధం చెబుతున్నారని అంటున్నారు. ఏటా ఇంటి యజమాని చెల్లిస్తున్న పన్ను పై 5శాతం పన్నులు పెంచే విధానం ఉండేదనీ, ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆ విధానానికి స్వస్థి చెప్పిన పంచచాయతీ, సచివాలయ కార్య నిర్వహణ అధికారులు సుమారుగా 5 వందలు పన్ను చెల్లించే వారికి 1200 పైబడి పన్నులు జాబితా సిద్ధం చేసారని వాపోతున్నారు. ఈ విధానం పై పిఠాపురం శాసన సభ్యుడు కొణిదల పవన్ కళ్యాణ్ దృష్టి సారించి పల్లె ప్రజలపై సర్వే పేరిట భారాన్ని మోపే పద్ధతిపై విచారణ చేపట్టాలని నియోజకవర్గ ప్రజలు వేడుకుంటున్నారు.



# బ్యాంకు కొలువులు సుష్మా నాయుడు సొంతం

తాజాగా దేశంలోనే గుర్తింపు కలిగిన ఇండియన్ బ్యాంకు (స్కేల్-1 ఆఫీసర్) అసిస్టెంట్ మేనేజర్ గా ఎంపికైంది. గత ఏడాది ఆగష్టు, నవంబరు నెలల్లో జరిగిన బ్యాంకు పరీక్షలలో తొలి ప్రయత్నంలోనే ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్, ఇండియన్ బ్యాంకు ఆఫీసు అసిస్టెంట్ ఉద్యోగాలకు ఎంపికైంది. ఒకే సారి మూడు ఉద్యోగాలు సాధించింది. వీటిలో ఏపీ గోదావరి గ్రామీణ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ గా తిరుపతి సమీపంలో రైల్వే కోడూరు చిన ఓరంపాడు బ్రాంచ్ లో చేరింది. ఆ ఉద్యోగం చేస్తున్న నెల రోజులకే కీలకమైన యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా (యుబిఐ) స్కేల్-1 ఆఫీసర్ అసిస్టెంట్ మేనేజర్ గా ఎంపికైంది. దీంతో గోదావరి గ్రామీణ బ్యాంకు ఉద్యోగానికి రాజీనామా చేసి ఈ ఏడాది మే నెలలో పశ్చిమగోదావరి జిల్లా తణుకు సమీపంలో గల రేలంగి బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ గా చేరింది. ప్రస్తుతం ఆ ఉద్యోగం చేస్తుంది. ఇంతలో ఇప్పుడు మరింత కీలకమైన ఇండియన్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ గా ఎంపికైనట్లు ఉత్తర్వులు రావడం విశేషం.



**- అసలు ఆ పట్టుదల ఎలా వచ్చిందంటే..**

ఎవరైనా అనుకున్నది సాధించాలంటే అందుకు తగినంత కృషి, పట్టుదల, కసి ఉండాలి. మరి ఈ సుష్మా నాయుడుకి ఇవన్నీ ఎలా వచ్చాయో ఒకసారి పరిశీలిద్దాం. నర్సరీ నుంచి పదో తరగతి వరకు కడియం శ్రీ షిర్డీ సాయి స్కూల్లో చదివింది. ఇంటర్మీడియట్ రాజమహేంద్రవరం తిరుమలలో పూర్తి చేసింది. కంప్యూటర్ సైన్స్ కోర్స్ కి సబంధించి శ్రీనగర్ ఐఐటీకి ఎంపికైంది. అయితే అపుడు అక్కడ యుద్ధ వాతావరణం ఉండడంతో అంత సురక్షితమైన ప్రాంతం కాదని తండ్రి శ్రీనివాసరావు అక్కడకు పంపించడానికి ఇష్టపడలేదు. చెన్నై సమీపంలో కంచి యూనివర్శిటీలో ఇంజనీరింగ్ పూర్తి చేసింది. అప్పటికే సాఫ్ట్ వేర్ ఫీల్డ్ బాగా వీక్ గా ఉంది. స్నేహితులందరూ ఎమ్మెస్ చేయడానికి అమెరికా వెళ్తున్నారని తను కూడా వెళ్ళింది. తీరా అక్కడికి వెళ్లాక చదువు పూర్తి చేసి అయిదారు సంవత్సరాలైనా ఉద్యోగాలు లేక అల్లాడిపోతున్న చాలామందిని చూసింది. దీనికి తోడు ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ పెట్టే ఆంక్షలు. ఇలాంటి పరిస్థితులలో అక్కడ లక్షలాది రూపాయలు ఖర్చుబెట్టి చదివినా ఉద్యోగ అవకాశాలు అంతంత మాత్రంగానే ఉంటాయని పసి గట్టి కొన్ని నెలలకే తిరిగి ఇండియా వచ్చేసింది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకు ఖాతాదారులు పడే ఇబ్బందులు, కొందరు బ్యాంకు ఉద్యోగులు ప్రదర్శించే చిరాకు పరాకులు గుర్తించి ఈ బ్యాంకు ఉద్యోగం సాధించి సేవలు అందించాలని ప్రయత్నించడం మొదలుపెట్టింది. బాల్యం నుండి తెలుగు, ఆంగ్ల దినపత్రికలు చదవడం అలవాటు. దీంతో సామాజిక అంశాలపై పట్టు ఉండటంతో బ్యాంకు కొలువులకు సన్నిద్ధమైంది. అలాగని కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరగలేదు. తను సొంతంగానే ఆన్ లైన్ ద్వారా సమాచారం సేకరించి ఈ పరీక్షలకు రేయింబవళ్ళు కష్టపడి ప్రయత్నించింది. తన టార్గెట్ ను సాధించింది. పూర్తి గ్రామీణ ప్రాంతం నుండి బ్యాంకు ఉద్యోగాలు సాదించేవారు తక్కువగానే ఉంటారు. సుష్మా ఇంత తక్కువ సమయంలో మొదటి ప్రయత్నంలోనే ఇన్ని ఉద్యోగాలు సాధించి ఎందరికో ఆదర్శంగా నిలుస్తుంది.

**- పల్లెల్లో ఇలాంటి మాటలు తప్పవు**

అయితే ఈ సందర్భంగా సుష్మా తల్లిదండ్రులు శ్రీనివాసరావు, జ్యోతిలు ఎదుర్కొన్న పల్లెటూరు సమస్యలు కూడా ప్రస్తావించుకోవాలి. ఆ అమ్మాయిని ఉన్నత చదువు కోసం అమెరికా పంపిస్తే ఒక్కగాని ఒక అమ్మాయిని డబ్బు సంపాదనకు అమెరికా పంపించేసారు ఇక్కడ వాళ్ళ కున్నది చాలదా అన్నారు. అమెరికా నుంచి వచ్చేస్తే చదివే ఓపిక లేనప్పుడు అంత దూరం పంపించడం ఎందుకన్నారు. లక్షల మందితో పోటీపడి గ్రామీణ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ పోస్ట్ సంపాదిస్తే ఊరూ పేరు లేని బ్యాంకు లో ఉద్యోగం వచ్చింది.. ఏ నాయకుడికో లంచం ఇచ్చి తెచ్చుకున్నారన్నారు. ఇప్పుడు ఆ ఇరుగు పొరుగు వారి మాటలు ఆగాయి. అంటే వాళ్ళని తప్పు పట్టడం కాదు. వారికున్న విద్యా పరిజ్ఞానం అలాంటిది. అంటే పల్లెటూర్లో ఇలాంటివి కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని చెప్పడానికి మాత్రమే ఇది.

# ‘అఖండ 2’ సినిమాకు తెలంగాణ హైకోర్టు షాక్...

నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న ‘అఖండ 2’ చిత్రానికి విడుదల ముందు ఊహించని షాక్ తగిలింది. తెలంగాణలో ఈ సినిమా ప్రీమియర్ షోలు, టికెట్ ధరల పెంపునకు అనుమతిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు సస్పెండ్ చేసింది. మరికొన్ని గంటల్లో ప్రీమియర్లు ప్రారంభం కానుండగా ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.వివరాల్లోకి వెళితే, ‘అఖండ 2’ సినిమాకు ప్రత్యేక షోలకు అనుమతి ఇవ్వడం, టికెట్ ధరలు పెంచుకోవడానికి వీలు కల్పించడాన్ని సవాలు చేస్తూ అడ్వకేట్ పాదూరి శ్రీనివాస్ రెడ్డి హైకోర్టులో లంచ్-మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఈరోజు విచారణ చేపట్టిన న్యాయస్థానం, ప్రభుత్వ జీవోను తక్షణమే నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలంటూ రాష్ట్ర హోంశాఖ, చిత్ర నిర్మాత, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు నోటీసులు జారీ చేసి, తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసింది. బాలకృష్ణ కథానాయకుడిగా రూపొందిన ఈ భారీ యాక్షన్ చిత్రం రేపు (డిసెంబర్ 12) ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ రాత్రికి ప్రీమియర్ షోలు పడనున్నాయి. ఇందులో సంయుక్త మీనన్ హీరోయిన్‌గా నటించగా, ఆది పినిశెట్టి ప్రతినాయకుడి పాత్ర పోషించారు.తాజా కోర్టు ఆదేశాలతో ఇవాళ రాత్రి జరగాల్సిన ప్రీమియర్ షోలపై గందరగోళం నెలకొంది. టికెట్ ధరల విషయంలోనూ సందిగ్ధత ఏర్పడటంతో అభిమానులు ఆందోళన చెందుతున్నారు.

# గిరిజన పాఠశాలల్లో 417 ఉపాధ్యాయ పోస్టుల అప్‌గ్రేడేషన్‌కు గ్రీన్ సిగ్నల్

**మౌలిక సదుపాయాలకు పెద్దపీట**

రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా జాతీయ రహదారి 16పై భారీ ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. తాడేపల్లి వరకు 3.8 కిలోమీటర్ల పొడవున ఆరు లైన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించిన ఎల్1 బిడ్‌ను ఆమోదించారు. ఈ ప్రాజెక్టులో ఇంటర్‌ఛేంజ్‌లు, వంతెనలు, అండర్‌పాస్‌లు కూడా భాగంగా ఉంటాయి. ఈ ప్రాజెక్టు కాంట్రాక్టు విలువ రూ.532 కోట్ల 57 లక్షలుగా నిర్ణయించారు. దీనితో పాటు, చిత్తూరు జిల్లా కుప్పంలోని పలార్ నదిపై ఉన్న చెక్‌డ్యామ్ మరమ్మతులు, పునర్నిర్మాణ పనుల కోసం సవరించిన పరిపాలనా ఆమోదాన్ని కేబినెట్ మంజూరు చేసింది. గతంలో రూ.10.24 కోట్లుగా ఉన్న ఈ ప్రాజెక్టు వ్యయాన్ని రూ.15.96 కోట్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.

**ఉద్యోగులు, విద్యారంగానికి ప్రాధాన్యం**

ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట కల్పిస్తూ రెండు విడతల కరవు భత్యం (డీఏ) మంజూరుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా 3.64 శాతం చొప్పున డీఏ చెల్లించనున్నారు. మరోవైపు, గిరిజన ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను పెంచే లక్ష్యంతో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోని 417 పోస్టులను అప్‌గ్రేడ్ చేశారు. ఇందులో 227 తెలుగు, 91 హిందీ భాషా పండితుల పోస్టులతో పాటు 99 వ్యాయామ ఉపాధ్యాయుల (పీడీ) పోస్టులను స్కూల్ అసిస్టెంట్ల కేడర్‌కు ఉన్నతీకరించారు.

**చట్టాలు, బోర్డులపై కీలక నిర్ణయాలు**

బ్రిటిష్ కాలం నాటి పాత చట్టాలను రద్దు చేస్తూ జైళ్ల సంస్కరణల దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ రూపొందించిన ‘మోడల్ ప్రిజన్స్ యాక్ట్ 2023’కు అనుగుణంగా ‘ది ఆంధ్రప్రదేశ్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ యాక్ట్, 2025’ ముసాయిదా బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ బిల్లును త్వరలో శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. గంజాయి వంటి నేరాలకు పాల్పడిన ఖైదీలకు సైకియాట్రిస్టులతో కౌన్సెలింగ్ ఇచ్చి వారిలో సంస్కరణ తీసుకురావడంపై మరింత అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీంతోపాటు, రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు పునర్వ్యవస్థీకరణకు కూడా కేబినెట్ ఆమోదించింది. ఈ బోర్డుకు చైర్మన్‌తో పాటు నలుగురు సభ్యులను నియమించనున్నారు.

విరూపాక్ష ఆర్గానిక్స్‌కు 100 ఎకరాల భూమి పారిశ్రామిక అభివృద్ధికి ప్రోత్సాహం అందించే క్రమంలో వైజాగ్%-%చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పనులకు కేబినెట్ పూర్తి ఆమోదం తెలిపింది. ప్రముఖ సంస్థ విరూపాక్ష ఆర్గానిక్స్‌కు 100 ఎకరాల భూమి కేటాయించాలని నిర్ణయించింది. అమరావతిలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఐదు కంపెనీల ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేసింది. రిలయన్స్ కన్స్యూమర్ యూనిట్ ఏర్పాటుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలని కూడా తీర్మానించింది. రాజధాని అమరావతిలో నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు గవర్నర్ బంగ్లా, దర్బార్ హాల్, గెస్ట్‌హౌస్‌ల నిర్మాణానికి సంబంధించిన బిడ్డింగ్ ప్రక్రియకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిని రాజధాని నిర్మాణంలో కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

# అమరావతికి శాశ్వత హోదా..

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి శాశ్వత హోదా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో గానీ, లేదా వచ్చే సమావేశాల్లో గానీ అమరావతిని ఏకైక రాజధానిగా గుర్తిస్తూ బిల్లు ప్రవేశపెడతామని ఆయన తెలిపారు.రాజధానిని 2014 నుంచి గుర్తించాలా? లేక ఇప్పటి నుంచి గుర్తించాలా? అనే దానిపై ఉన్న సాంకేతిక కారణాల వల్లే బిల్లు ఆలస్యమవుతోందని పెమ్మసాని వివరించారు. ఈ ప్రక్రియను ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా పర్యవేక్షిస్తున్నారని అన్నారు. అమరావతి బిల్లుపై వైసీపీ అధినేత జగన్ విషం కక్కుతున్నారని, ఆయనను శాశ్వతంగా రాజకీయ సమాధి చేయాలని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జగన్‌కు పాలన చేతకాకపోవడం వల్లే 34 వేల మంది రైతులు ఇచ్చిన భూములను సద్వినియోగం చేసుకోలేక రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేశారని ఆరోపించారు.అమరావతిని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని, ఇప్పటికే వేలాది మంది నిర్మాణ పనుల్లో పాలుపంచుకుంటున్నారని పెమ్మసాని తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇప్పటికే 16 జాతీయ సంస్థలకు శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. త్వరలోనే హడ్కో, కాగ్, పోస్టల్ భవనం, కేంద్రీయ విద్యాలయాలు వంటివి అమరావతిలో ఏర్పాటు కానున్నాయని పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు, జాతీయ రహదారుల నిర్మాణానికి కూడా ప్రయత్నాలు ముమ్మరం చేశామని ఆయన వెల్లడించారు.

# ఇండిగో ప్రయాణికులకు ఊరట...

విమాన సర్వీసుల అంతరాయంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులకు ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో గురువారం ఊరట కల్పించే ప్రకటన చేసింది. ఈ నెల ప్రారంభంలో విమానాల రద్దు, ఆలస్యం కారణంగా తీవ్రంగా నష్టపోయిన వారికి రూ. 10,000 విలువైన ట్రావెల్ వోచర్లను అందిస్తున్నట్లు తెలిపింది.ఈ నెల 3 నుంచి 5వ తేదీ మధ్య దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాల్లో వేలాది మంది ప్రయాణికులు గంటల తరబడి చిక్కుకుపోయిన విషయాన్ని అంగీకరిస్తూ, జరిగిన అసౌకర్యానికి సంస్థ విచారం వ్యక్తం చేసింది. ఈ వోచర్లను రాబోయే 12 నెలల పాటు తమ భవిష్యత్ ప్రయాణాలకు ఉపయోగించుకోవచ్చని ఇండిగో ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన పరిహారానికి ఇది అదనమని స్పష్టం చేశారు. ఇప్పటికే రద్దయిన విమానాలకు సంబంధించిన రిఫండ్ల ప్రక్రియను ప్రారంభించినట్లు కూడా సంస్థ వెల్లడించింది.మరోవైపు గత వారం చోటుచేసుకున్న భారీ వైఫల్యాలపై దర్యాప్తు చేసేందుకు బయటి సాంకేతిక నిపుణులను నియమించనున్నట్లు ఇండిగో ఛైర్మన్ విక్రమ్ సింగ్ మెహతా తెలిపారు. సమస్య మూల కారణాలను గుర్తించి, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఈ నెల 8 నుంచి అన్ని గమ్యస్థానాలకు సేవలను పునరుద్ధరించామని, 9 నుంచి కార్యకలాపాలు పూర్తిస్థాయిలో స్థిరపడ్డాయని ఇండిగో పేర్కొంది. సురక్షితమైన, నమ్మకమైన ప్రయాణ అనుభూతిని అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపింది.


## మెస్సీ ఈవెంట్ కు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదు

అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుడు నగరానికి వస్తున్నందున, రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని రేవంత్ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమానికి తాను కూడా ఒక అతిథిగా మాత్రమే హాజరవుతున్నానని చెప్పారు. ఈ ఈవెంట్‌కు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు ఆయన వెల్లడించారు. ఢిల్లీలో కలిసిన ప్రముఖులను కూడా ఈ కార్యక్రమానికి రావాలని కోరినట్లు తెలిపారు.

‘మెస్సీ గోట్ ఇండియా టూర్’లో భాగంగా ఈ నెల 13న మెస్సీ హైదరాబాద్ రానున్నారు. ఉప్పల్ స్టేడియంలో జరిగే ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో ఆయన పాల్గొంటారు. ఈ మ్యాచ్‌లో మెస్సీతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, పలువురు అంతర్జాతీయ క్రీడాకారులు కూడా రెండు జట్లుగా విడిపోయి ఆడనున్నారు. మెస్సీ పర్యటన నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

# ఇస్రో దూకుడు...

అమెరికాకు చెందిన ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ సంస్థ ఈ ఉపగ్రహాన్ని అభివృద్ధి చేసింది. ఈ ప్రయోగం కోసం అక్టోబర్ 19నే ఈ ఉపగ్రహం అమెరికా నుంచి భారత్‌లోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్‌కు చేరుకుంది. ఇది కక్ష్యలో అతిపెద్ద కమర్షియల్ ఫేజ్డ్ అర్రేను కలిగి ఉంటుందని, గతంలో పంపిన బ్లూబర్డ్ ఉపగ్రహాల కన్నా 10 రెట్లు అధిక డేటా సామర్థ్యంతో పనిచేస్తుందని ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ ఒక ప్రకటనలో తెలిపింది.ఇస్రో వాణిజ్య విభాగమైన న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ (%చీ×ూ%) ఈ ప్రయోగాన్ని పర్యవేక్షిస్తోంది. అంతరిక్ష రంగంలో భారత్, అమెరికా మధ్య ఇది రెండో అతిపెద్ద సహకారం. గత జూలైలో ఇస్రో, నాసా సంయుక్తంగా అభివృద్ధి చేసిన 1.5 బిలియన్ డాలర్ల నిసార్ (%చీ×ూూ=%) ఉపగ్రహాన్ని ఇస్రో విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే.%ూఎవీ%3 రాకెట్ 8,000 కిలోల బరువును లో-ఎర్త్ ఆర్బిట్‌లోకి, 4,000 కిలోల బరువును జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి మోసుకెళ్లగలదు. ఇటీవలే నవంబర్ 2న 4.4 టన్నుల బరువున్న సీఎంఎస్-3 ఉపగ్రహాన్ని ఈ రాకెట్ ద్వారానే విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టారు.



# యూనియన్ గౌరవ అధ్యక్షులుగా ఎం వెంకటేశ్వర్లు ఎన్నిక.

కావలి

ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ కార్యాలయంలో కావలి పట్టణ యూనియన్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 60 సంవత్సరాలు దాటిన వారి స్థానంలో మరణించిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. పారిశుద్ధ కార్మికులకు సబ్బులు, చెప్పులు, కొబ్బరి నూనె ,యూనిఫారం, బ్లౌజులు, హెల్త్ కార్డులు, ఇవ్వాలని డైలీ వేజ్ కార్మికులకు పెరిగిన ధరలకు అనుకూలంగా డైలీ వేజ్ వర్కర్స్ కమిటీ పారిశుద్ధ్య కార్మికులకు వేతనం రూ 597 లుగా నిర్ణయించారని కమిటీ ఏదైతే నిర్ణయించిందో ఆ మేరకు డైలీ వేజ్ వర్కర్స్ కు వేతనం అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని తక్షణమే అమలు చేయాలని మున్సిపల్ కార్మిక సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళన చేపడతామని తెలిపారు. అనంతరం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లీ అంకయ్య అనుమతితో యూనియన్ నూతన గౌరవ అధ్యక్షులు గా ఫారెస్ట్ డిపార్ట్మెంట్లో రిటైర్డ్ అయిన గతంలో కావలి నియోజకవర్గం లో సుదీర్ఘ అనుభవం కలిగిన సీనియర్ కామ్రేడ్ ఎం వెంకటేశ్వర్ల ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శి వై ఆదినారాయణ, టి వెంకటేష్, ఆర్సి మాలకొండయ్య, పి సుబ్బరాయుడు, సుభాని, ప్రభావతి, శ్రీను, దమ్ము దర్గాబాబు, వెంకటరమణయ్య, డ్రైవర్స్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ పేరుతో ఓట్లను లాక్కుంటారు

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగింపునకు గురైతే, మహిళలు వంటింటి ఆయుధాలతో (కిచెన్ టూల్స్)తో సిద్ధంగా ఉండాలని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. ఎస్ఐఆర్ అనంతరం పేర్లు తొలగింపునకు గురైతే ఊరుకునేది లేదని ఆమె అన్నారు.ఎస్ఐఆర్ పేరుతో మీ తల్లులు, సోదరీమణుల ఓట్లను లాక్కుంటారని ఆమె హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ఢిల్లీ నుంచి పోలీసులను తీసుకువచ్చి బెదిరిస్తారని ఆమె ఆరోపించారు. జాబితాలో మీ పేరు లేకపోతే మీ వంటగదిలో వాడే వస్తువులే మీ బలమని ఆమె పేర్కొన్నారు. మహిళలు ముందుండి పోరాడతారని ఆమె అన్నారు.మహిళలు బలవంతులా, బీజేపీ బలమైన పార్టీయా చూడాలనుకుంటున్నానని ఆమె వ్యాఖ్యానించారు. తాను లౌకికవాదాన్ని నమ్ముతానని ఆమె స్పష్టం చేశారు. బెంగాల్ ప్రజలను విభజించేందుకు ఎన్నికల సమయంలో బీజేపీ డబ్బులు పంచుతోందని, ఇతర రాష్ట్రాల నుంచి మనుషులను కూడా దింపుతోందని ఆమె విమర్శించారు.రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, రవీంద్రనాథ్ ఠాగూర్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ వంటి మహనీయులు ఎన్నడూ ప్రజలను విభజించేలా వ్యవహరించలేదని ఆమె అన్నారు. స్వాతంత్ర్యం కోసం బెంగాల్ ప్రజలు ప్రాణాలు త్యాగం చేశారని, ఇప్పుడు భారత పౌరులుగా మనం దానిని నిరూపించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు

# క్రీస్తు బోధనలే ప్రపంచానికి మార్గదర్శకాలు

**- జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డేనియల్ పాల్.**



ఆలమూరు,
పరోపకారం, పొరుగువారికి ప్రేమను పంచడం వంటి క్రీస్తు బోధనలు ప్రపంచాన్ని శాంతియుతంగా నడిపించడంలో కీలక భూమిక వహిస్తున్నాయని, తన బిడ్డలను ఏసు అమితంగా ప్రేమిస్తాడని వారు ఆయన ప్రేమకు ప్రతీకలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు బిసప్ జె డానియల్ పాల్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన ఆలమూరులో మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎలిషా అధ్యక్షతన జరిగిన మండల ఐక్య గ్రాండ్ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని ఆయన ప్రార్థించారు. ముందుగా కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన ఐక్య గ్రాండ్ క్రిస్మస్ వేడుకల్లో వారు మాట్లాడుతూ సర్వ మానవాళి సుఖసంతోషాలతో జీవించాలని, పాపము నుండి రక్షణ పొందాలని తన రక్తాన్ని చిందించిన ప్రభువు యేసుక్రీస్తు సందేశాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. సమాజంలో ప్రతి వ్యక్తి ఆదర్శప్రాయంగా తీసుకుంటే ప్రతి మనిషికి మంచి జరుగుతుందని అన్నారు. శాంతి సహనం క్రీస్తు మానవులకు నేర్పిన గొప్ప సూక్తులు అన్నారు. సాటి మనుషులను ప్రేమించిన వారికి సహాయం అందించిన మానవ జీవితానికి సార్ధకత ఉంటుందని, భువిలో పుట్టిన ప్రతి మనిషికి ఇదే కర్తవ్యం కావాలని లేనిచో మన జీవితానికి అర్థం ఉండదని ప్రభువు తన జీవితమంతా ప్రజల ఆనందం కోసం తపించారని, తనపై నిందలు మోపి సిలువ నెక్కిస్తున్న సహనంతో వారిని క్షమించాలి కానీ వారిని ద్వేషించలేదని అన్నారు. మనం కూడా దీనిని గుర్తించి మనలోని రాగద్వేషాలను తరిమివేసి తోటి వారిని అభిమానిద్దాంమని పేర్కొన్నారు. ఆ గ్రామ సర్పంచ్ లావణ్య కుమార్ రాజా పాల్గొని వచ్చిన పాస్టర్స్ కు ఐక్య క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సర్పంచ్ దంపతులను పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. క్యాబినెట్ నాయకులు సుందర విజయం, రీజనల్ చైర్మన్ జాన్ బాబు, జిల్లా నాయకులు ఎస్ జె సుధాకర్, టి రత్నం, జిల్లా సెక్రెటరీ ఎస్ జీవన్ ప్రసాద్, గౌరవ అధ్యక్షులు వై చిన్న బాబు, అడ్వైజర్ ఆర్ పాల్, క్రిస్టియన్ మైనార్టీ చైర్మన్ శ్యాం మహిమ కుమార్, మాజీ మైనార్టీ చైర్మన్ సామెల్, మండలంలోని అన్ని గ్రామాల పాస్టర్స్ పాల్గొన్నారు.









# కావలిలో ధరణి సామిల్ టింబర్ డిపోను ప్రారంభించిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి





కావలి,
కావలి పట్టణం మద్దూరుపాడు సమీపంలో గురువారం ధరణి సామిల్ %ిడ% టింబర్ డిపోను ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కార్యనిర్వాహకులు, వార్డు నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి సన్మానం చేశారు.ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి, ధరణి సామిల్ ప్రాంగణాన్ని సందర్శించారు.తరువాత డిపో యజమాని రమేష్ బాబు కుటుంబానికి శుభాకాంక్షలు తెలుపుతూ, కొత్త వ్యాపారం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.కావలి పరిసర ప్రాంతాల్లో చెక్కల సరఫరా, కార్పెంటరీ వర్క్స్, నిర్మాణ సామగ్రికి నాణ్యమైన సేవలను అందించాలనే లక్ష్యంతో డిపోను ఏర్పాటు చేసినట్లు యజమానులు తెలిపారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు ఏర్పడుతాయని, చిన్న వ్యాపారులకు ఇది ఉపయోగకరంగా మారుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.కార్యక్రమంలో పలువురు నాయకులు,వ్యాపారులు, స్థానికులు పాల్గొన్నారు

# విద్యార్థులకు రక్త నమూనా నిర్ధారణ పరీక్షలు

కావలి,
కొండాపురంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నాడు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కొండాపురం మండలకన్వీనర్ "తాటికొండ నవీన్" ఆధ్వర్యంలో 6నుండి10తరగతుల విద్యార్థులకు "రక్త నమూనా నిర్ధారణ పరీక్షలు" నిర్వహించడం జరిగింది. ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణ మాట్లాడుతు ప్రతి వ్యక్తి తన రక్తవర్గం తెలుసుకొని ఉండటం తమ కనీస బాధ్యత అని, రక్త గ్రూ గ్రూప్‌లను తెలుసుకోవడమే కాకుండా ఆపదలో వున్నవారికి రక్తదానం చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. కొండాపురం రెడ్ క్రాస్ కన్వీనర్ తాటికొండ నవీన్ మాట్లాడుతూ రక్త వర్గ నిర్ధారణ చేయించుకోవడం వల్ల అత్యవసర సమయంలో మీకు రక్తం అవసరమైనప్పుడు బ్లడ్ గ్రూప్ తెలుసుకొని వుండటం ముఖ్యమని అన్నారు.రక్తదానం ఆవశ్యకతని తెలుపుతూ రక్త నిర్ధారణ ఆవశ్యకతని తెలిపారు.రక్త వర్గ నిర్ధారణ పై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు120 మంది విద్యార్థులకు రక్త నమూనాపరీక్షలు నిర్వహించి రక్తం యొక్క గ్రూపు నిర్ధారణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో కొండాపురం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణ, ఉపాధ్యాయులు, రెడ్ క్రాస్ కొండాపురం మండల కన్వీనర్ తాటికొండ నవీన్, రెడ్ క్రాస్ సిబ్బంధి పద్మ, శేషమ్మ, అనిల్ పాల్గొన్నారు.







# పొగాకులో అన్య పదార్థాల నిర్మూలన శిక్షణ కార్యక్రమం



పొన్నలూరు, మండల పరిధిలోని చెరువుకొమ్ముపాలెం గ్రామంలో పొగాకు రైతులకు పొగాకులో పురుగు మందుల అవశేషాలు నిర్మూలన, అన్య పదార్థాలు నిర్మూలన, తలత్రించుట, పొగాకు ఉత్పత్తిలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు శిక్షణ సదస్సు గురువారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్య క్రమంలో 26వ పొగాకు బోర్డు వేలం కేంద్రం నిర్వహాణాధికారి వి. శివకుమార్ మాట్లాడుతూ పొగాకు పంట లో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించాలని తెలిపారు. నారును తగిన సమయం లో పొలంలో నాటలని పేర్కొన్నారు. సమగ్ర సన్య రక్షణ చర్యలు,ఉత్తమ యాజమాన్య పద్ధతులను పాటిస్తూ మంచి దిగుబడుతో పాటు నాణ్యమైన పొగాకును ఉత్పతి చేయవచ్చు అని తేలిపారు. రైతులు ఉత్తమ యజమాన్య పద్ధతులను పాటించాలనీ,విచ్చలవిడి గా పురుగుమందులు వినియోగించడం వలన వచ్చే అనర్థాలు వివరించారు, బోర్డు వారు సిఫారసు చేసిన పురుగు మందులనే ఉపయోగించాలని తెలిపారు.రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకం లో తగు జాగ్రత్తలు పాటించాలని ప్రధానం గా జీవామృతం ఎరువులను పచ్చిరోట్ట ఎరువులు వినియోగించాలని అన్నారు. రైతులు పొగ నాట్లు ఒకేసారి కాకుండా రెండు మూడు దఫాలుగా సాగు చేసుకోవాలని తెలిపారు.పొగాకు పంటలోసిటిఆర్ఐఅధికారులు సూచించిన పురుగు మందులను మాత్రమే అవసరం అయిన మోతాదులో పిచికారి చెయ్యాలి అన్నారు. పొలం, బారన్ కౌలును సైతం తగ్గించాలనీ అన్నారు. పొగాకు లో ఈ అన్య పదరదలు లేకుండా చూసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమం లో ఐ.టి.సి కంపెనీ ప్రతినిధి విజయ్ , జి.పి.ఐ కంపెనీ ప్రతినిధి ఉన్నం శ్రీనివాస్ , పొగాకు రైతులు, పొగాకు బోర్డు క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 19వ తేదీన థియేటర్స్‌లో ప్రేక్షకుల ముందుకు రానున్న “సఃకుటుంబానాం”

హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, డిసెంబర్ 11 : హెచ్.ఎన్.జి సినిమాస్, ఎల్.ఎల్.పి బ్యానర్ పై ఉదయ్ శర్మ రచన దర్శకత్వంలో మహదేవ్ గౌడ్, నాగరత్న నిర్మాతలుగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం సఃకుటుంబానాం. రామ్ కిరణ్, మేఘ ఆకాష్ జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో నటకిరీటి రాజేంద్రప్రసాద్, హాస్యబ్రహ్మ బ్రహ్మానందం, శుభలేఖ సుధాకర్, సత్య, రాజశ్రీ నాయర్, రచ్చ రవి, గిరిధర్, తాగుబోతు రమేష్, భద్రం తదితరులు కీలకపాత్రలో పోషిస్తున్నారు. మణిశర్మ ఈ సినిమాకు సంగీతాన్ని అందించగా మధు దాసరి డిఓపిగా పనిచేశారు. ఎడిటర్ గా శశాంక్ మలి చేశారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర ట్రైలర్ కు సోషల్ మీడియా ద్వారా మంచి ప్రశంసలు వచ్చాయి. అయితే డిసెంబర్ 12వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం బోయపాటి శ్రీను దర్శకత్వంలో నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ తాండవం చిత్రం అదే రోజున ప్రేక్షకుల ముందుకు వస్తున్న కారణంగా బాలయ్యపై ఉన్న గౌరవంతో అఖండ 2 సినిమాకు తమ సినిమా వల్ల ఎటువంటి చిన్నపాటి అంతరాయం కలవకూడదనే ఉద్దేశంతో తమ “సఃకుటుంబానాం” చిత్రాన్ని డిసెంబర్ 19వ తేదీన విడుదల చేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా డిసెంబర్ 12వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానున్న నందమూరి బాలకృష్ణ అఖండ తాండవం చిత్రం ఒక విజయం సాధించాలని కోరుకుంటున్నాము. కొన్ని నిర్ణయాలు వ్యాపారం కోసం కాదు, ఎమోషన్స్ కోసం. అదేవిధంగా ఈ నిర్ణయం కూడా “జై బాలయ్య” అనే తెలుగువారి నినాదం కోసం. మరొకసారి “సఃకుటుంబానాం” చిత్రం డిసెంబర్ 19వ తేదీన థియేటర్లలో ప్రేక్షకులు ముందుకు రానుందని తెలియజేసుకుంటున్నాము.

– తారాగణం :
రామ్ కిరణ్, మేఘా ఆకాష్, రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, సత్య, శుభలేఖ సుధాకర్, రాజశ్రీ నాయర్, రచ్చ రవి, గిరిధర్, తాగుబోతు రమేష్, భద్రం తదితరులు.


– సాంకేతిక బృందం :
రచన %ఉ% దర్శకత్వం: ఉదయ్ శర్మ
నిర్మాత : హెచ్.మహదేవ గౌడ్
సంగీతం : మణి శర్మ
డిఓపి : మధు దాసరి
ఎడిటర్ : శశాంక్ మలి
కొరియోగ్రాఫర్ : చిన్ని ప్రకాష్, భాను, విజయ్ పొలాకి
సాహిత్యం : అనంత శ్రీరామ్
ఆర్ట్ డైరెక్టర్ : పి.ఎస్. వర్మ
ఫైట్స్ : అంజి, కార్తీక్
ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : రోహిత్ కుమార్ పద్మనాభ
పి ఆర్ ఓ : మధు.వి.ఆర్
డిజిటల్ : డిజిటల్ దుకాణం








## తెలుగు తెరపై విరిసే మరో మలయాళ బ్యూటీ!



తెలుగు తెర ఎప్పటికప్పుడు కొత్త కథానాయికలను పరిచయం చేయడానికి ఉత్సాహాన్ని కనబరుస్తూ ఉంటుంది. కొత్త బ్యూటీలను ఆదరించడానికి ఇక్కడి ప్రేక్షకులు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారు. ఒకప్పుడు ఇక్కడి సిల్వర్ స్క్రీన్ పై ముంబై భామల హవా కొనసాగినప్పటికీ, ఆ తరువాత కాలంలో మలయాళ భామలు తమ జోరును కొనసాగిస్తూ వచ్చారు. ఇప్పటికీ ఇక్కడ వారి దూకుడే కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే మరో అమ్మాయి మలయాళం నుంచి దిగిపోయింది. ఆ బ్యూటీ పేరే అనశ్వర రాజన్.

అనశ్వర రాజన్ .. మలయాళంలో .. అక్కడి యూత్ లో ఇప్పుడు విపరీతమైన క్రేజ్ ఉన్న హీరోయిన్. అనశ్వరలో ఏదో తెలియని ఒక ప్రత్యేకమైన ఆకర్షణ ఉంటుంది. అందుకు సహజమైన ఆమె అభినయం కూడా తోడవడం .. సక్సెస్ లు వచ్చిపడటంతో బిజీగా మారిపోయింది. మలయాళంలో వచ్చిన ‘నెరు’ .. ‘రేఖాచిత్రం’ వంటి చిత్రాలు ఆమె నటనకి అద్దం పడతాయి. మోహన్ లాల్ వంటి గొప్ప నటుడితో ప్రశంసలు అందుకోవడం అనశ్వర ప్రతిభకు నిదర్శనం అనే చెప్పాలి.

మలయాళంలో ఇప్పుడు అనశ్వరకి విపరీతమైన క్రేజ్ ఉంది. అక్కడి సినిమాలను లైన్లో పెడుతూనే, ఆమె తెలుగు .. తమిళ .. హిందీ సినిమాలు చేయడానికి ఆసక్తిని కనబరుస్తూ ఉండటం విశేషం. తెలుగులో ఆమె చేసిన ‘ఛాంపియన్’ సినిమా ఈ నెల 25వ తేదీన థియేటర్లకు రానుంది. శ్రీకాంత్ తనయుడు రోషన్ జోడీగా ఆమె పరిచయమవుతూ ఉండటం విశేషం. ఈ సినిమా హిట్ అయితే అనశ్వర ఇక్కడ మరిన్ని సినిమాలు చేసే ఛాన్స్ ఉంది. ఓటీటీ సినిమాల ద్వారా అనశ్వర అభిమానులుగా మారిపోయిన ఇక్కడి కుర్రాళ్లంతా ఈ సినిమా కోసమే వెయిట్ చేస్తున్నారు.




Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com